క్లుప్తంగా

ప్రజల్లో చైతన్యం తేవాలి



ఓఆర్ఎస్ తయారు చేసే విధానాన్ని వివరిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తెచ్చి ముందస్తు జాగ్రతలు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సంచార చికిత్స ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. మంగళవారం పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లోని ప్రాథమిక వైద్య శాలలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో మాసాంతపు సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేసే విధానాన్ని ఆరోగ్య విస్తరణ అధికారి విజయకృష్ణతో సిబ్బందికి వివరించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికలకు రక్తహీనతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుల ఆరోగ్యం తదితర అంశాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టనిస్ట్ ఖలీల్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయాలను అరికట్టాలి



రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా పట్టణంలో నకిలీ విత్తనాల విక్రయాలను వ్యవసాయ శాఖ అధికారులు అరికట్టాలని ఏపీ రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో విత్తన దుకాణాలు, ఫర్టిలైజర్, పెస్టిసైడ్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. పక్క రాష్ట్రాల నుంచి పురుగు మందులు తెచ్చి విక్రయిస్తుండటంతో రైతులు మోసపోతున్నారన్నారు. అధికారులు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయన్న మాబు, హుసేని, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

ఆదోని అర్బన్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు అన్నారు. మంగళవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేని వాహనాలకు జరిమానా విధించారు.

గోవధ నేరం



ముస్లింలతో మాట్లాడుతున్న సీఐలు

ఆదోని అర్బన్: గోవులను తరలించడం, గోవధ చేయడం చట్టరీత్యా నేరమని, గోవధ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 7వ తేదీన జరిగే బక్రీద్ పండగ సందర్భంగా ముస్లింలతో పీస్ సమావేశం నిర్వహించారు. సీఐలు మాట్లాడుతూ హిందువులు పూజించే గోవులను వధించడం, తరలించడం, మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించడం లాంటి వాటికి పాల్పడితే ఎనిమల్ యాక్ట్ కింద కఠిన చర్యలు తప్పవన్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా, వాట్సప్, ఫేస్‌బుక్‌లలో రెచ్చగొట్టేవిధంగా, మతస్తుల మనోభావాలు దెబ్బతీసేలా వీడియోలు వైరల్ చేస్తే వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బక్రీద్ పండగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి



గోనెగండ్లలో జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

గోనెగండ్ల : జలజీవన్ మిషన్ పథకంతో ఇంటింటికీ మంచినీటి కుళాయిలను వేస్తున్నట్లు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని శివాలయం దేవాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ జల జీవన్ మిషన్ పథకం కింద నిర్మించిన ఓహెచ్ ఆర్ ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ట్యాంకు నుంచి కుళాయిలకు నీటిని విడుదల చేశారు. అనంతరం చిన్నమరివీడు గ్రామంలో మండల నీధులతో ఏర్పాటు చేసే పైపులైన్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఏఈ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ మణి మంజరి, తహసీల్దార్ కుమారస్వామి, సర్పంచ్ హైమవతి పాల్గొన్నారు.

తొలిరోజు విద్యా కానుక అందేనా?

- మండల కేంద్రాలకు చేరిన పాఠ్య, నోట్ పుస్తకాలు
- కన్నడ, ఉర్దూ మీడియం పుస్తకాలు పెండింగ్
- మిగతా విద్యా సామగ్రి ఇంతవరకు చేరని వైనం
- పాఠశాలల పునఃప్రారంభానికి దగ్గరపడుతున్న సమయం



స్టాక్ పాయింట్‌కు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

ఆదోని సెంట్రల్: పాఠశాలలు పునఃప్రారంభానికి ఇంకా పదమూడు రోజులు సమయం ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పాఠ్య, నోట్ పుస్తకాలు 85 శాతం నుంచి 90 శాతం వరకు వచ్చాయి. కన్నడ, ఉర్దూ, ఇంగ్లీషు మీడియం పుస్తకాలతో పాటు మిగిలిన వస్తువులు ఇంకా రాలేదు. దీంతో పాఠశాలలు తెరిచేలోపు విద్యాకానుకలోని అన్ని వస్తువులు విద్యార్థులకు అందేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యాకానుకకు శ్రీకారం..

పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులకు ఆర్థికభారం తల్లిదండ్రుల మీద పడకూడదని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాకానుక పంపిణీకి శ్రీకారం చుట్టింది. గణనీయమైన మార్పులను తీసుకొని వచ్చి నాణ్యమైన మధ్యాహ్న భోజనం నుంచి విద్యాసామగ్రిని విద్యార్థులకు అందించింది. అది కూడా పాఠశాలలు పునఃప్రారంభం రోజే విద్యార్థులకు అవసరమైన 7 రకాల వస్తువులను సమకూర్చి విద్యాకానుకను అందించేవారు.

30,004 మంది విద్యార్థులు

ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకులం, పురపాలక, ఎయిడెడ్ పాఠశాలలు 130 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 30,004 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో పాఠశాలల్లో కేవలం పాఠ్యపుస్తకాలను మాత్రమే అందించేవారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టిన అనంతరం విద్యా సంస్కరణలతో పలు మార్పులను తీసుకొని వచ్చారు. విద్యార్థుల చదువులకు ఏ తల్లిదండ్రులు కూడా ఇబ్బందులు పడకూడదని విద్యాకానుక పంపిణీకి శ్రీకారం చుట్టారు. విద్యాకానుకలో పాఠ్య పుస్తకాలతో పాటు, నోట్ పుస్తకాలు, స్కూలు బ్యాగు, షూస్, సాక్స్, బెల్టు, యూనిఫాం వంటి వాటితో పాటు అక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, పిక్చర్ డిక్షనరీలతో కూడిన విద్యాకానుక కిట్‌ను విద్యార్థులకు అందించేవారు. అదికూడా పాఠశాలలు పునఃప్రారంభం రోజే అందేవిధంగా చర్యలు తీసుకునేవారు.

కూటమి ప్రభుత్వంలో పేరుమార్పు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జగనన్న విద్యా కానుకకు పేరును సర్వే పల్లి రాధాకృష్ణన్ విద్యార్థిమిత్రగా మార్చింది. అయితే ఇప్పటి వరకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, బెల్టులు మండల కేంద్రాలకు చేరాయి. కానీ మిగిలిన వస్తువులు స్కూల్ బ్యాగులు, షూ, సాక్సులు, టై, యూనిఫాం లాంటివి ఇంకా రాలేదు. పాఠశాలల పునఃప్రారంభానికి ఇంకా ఎనిమిది రోజులు సమయం ఉంది. అప్పటిలోపు మిగిలిన సామగ్రిని అందుబాటులో ఉంచాల్సి ఉంది.

విద్యాకానుక కిట్..

విద్యాకానుక కిట్‌లో మూడు జతలు యూనిఫాం, రెండు జతల సాక్సులు, మూడుసెట్లు నోట్‌పుస్తకాలు (ఒక సెట్‌లో 6 పుస్తకాలు), ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, బెల్ట్, ఒక జత షూస్‌తో పాటు ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలు, పిక్చర్ డిక్షనరీలు వంటివి అందించాల్సి ఉంది. నియోజకవర్గంలోని స్టాక్ పాయింట్‌కు నోట్ పుస్తకాలు 1,76,798, పాఠ్యపుస్తకాలు 1,31,000, బెల్టులు 20,156, ఆక్స్ ఫర్డ్ డిక్షనరీలు 3,145, చిల్డ్రన్స్ పిక్చర్ డిక్షనరీలు 2,117 వచ్చాయి. పాఠ్య పుస్తకాలు 90 శాతం దాకా వచ్చాయి. ఇంకా పదిశాతం పుస్తకాలు రావాల్సి ఉంది. ఉర్దూ, కన్నడ, ఇంగ్లీషు మీడియం పుస్తకాలు అందలేదు. అలాగే యూనిఫాం, బ్యాగు, షూస్, సాక్స్‌లు ఇంకా రావాల్సి ఉంది. పాఠశాలలు తెరచేలోపు విద్యాకానుక కిట్లు అందించే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు పేర్కొన్నారు.

వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం



నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు వచ్చాయి. ఇంకా 5 శాతం పాఠ్య పుస్తకాలు అంటే కన్నడ మీడియం, ఉర్దు మీడియంతో పాటు ఇంగ్లిషు మీడియం పుస్తకాలు రావాల్సి ఉంది. వచ్చిన పుస్తకాలను అయా పాఠశాలలకు చేర వేసేందుకు సిద్ధం చేస్తున్నాము. బ్యాగు, యూనిఫాం, షూస్, సాక్స్‌లు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అన్ని పాఠశాలలకు చేర వేసి విద్యార్థులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నాము.

– శ్రీనివాసులు ఎంఈఓ–2 ఆదోని

హామీలను నెరవేర్చాలి

గోనెగండ్ల : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్న గౌడ్, సీపీఐ సీనియర్ నాయకుడు మద్దిలేటి నాయుడు, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి తహసీల్దార్ కుమారస్వామికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసి, అర్హులైన నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బేతాల బాష, తదితరులు పాల్గొన్నారు.

పొలానికి హద్దులు చూపించండి

ఆదోని రూరల్: తమ పొలానికి హద్దులు చూపించాలని మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన హరిజన మారతమ్మ, హరిజన రామదాసు సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులను కోరారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 499లో ప్రభుత్వం ఇచ్చిన 63 సెంట్లు స్థలాన్ని 22 సంవత్సరాల నుంచి సాగు చేస్తున్నామన్నారు. ఆ పొలంపైన ఉన్న తలారి అనే వ్యక్తి 10 సెంట్లు దాకా ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. సర్వే చేయడానికి అధికారులు వస్తే లారికి అనుకూలంగా సర్వే చేయడం జరిగిందన్నారు. దళితులని తక్కువ చూస్తూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తమ సర్వే నంబర్‌లు ఉన్న 63 సెంట్లు చూపించాలని అధికారులను కోరారు. ఆక్రమించుకున్న తలారి వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నందవరంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూకరాజు



గోనెగండ్లలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



రాఘవేంద్ర సర్కిల్‌లో అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

నందవరం: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూకరాజు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో మలేరియా నివారణ మహోత్సవాలలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో మలేరియా అంతం మాతోనే అనే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దోమకాటుతోనే 5 రకాల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వివరించారు. జూన్ నుంచి డిసెంబర్ వరకు వర్షా కాలం కావడంతో దోమలు వ్యాప్తి చెంది రోగాలప్రబలు తాయని చెప్పారు. దోమల నివారణకు డ్రైనేజీలు, నీటి కుంటలు, కాలువలు, నీరు నిల్వ ఉన్న చోట్ల పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ డాక్టర్ నరసింహులు, పీహెచ్‌సీ డాక్టర్ రేవతి, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, సుశీల బాయి తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధిపై జాగ్రత్త వహించండి

గోనెగండ్ల: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రంగ రవళి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవము సందర్భంగా మంగళవారం ఆస్పత్రి సిబ్బంది స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ మీదుగా ఎస్‌బీఐ బ్యాంకు వరకు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా ఇతర ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్న దోమలను తరిమికొట్టాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే దోమలను నివారించు కోవచ్చునన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హనుమంతు, పరమేష్ పాల్గొన్నారు.

దోమల నివారణకు పాటుపడదాం

మంత్రాలయం రూరల్: దోమల నివారణ కోసం పాటుపడదామని జిల్లా మలేరియా అధికారి నూకరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైద్య బృందంతో మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణతోనే సీజనల్ వ్యాధులను నివారించవచ్చన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్ గున్యా వ్యాధులు ప్రబలకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సూచనలు కచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి గోవిందమ్మ, హెల్త్ సూపర్ వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నీ కొడుకును అరెస్టు చేశామంటూ బెదిరింపు కాల్



ఫోన్ కాల్ వచ్చిన డీపీ

మంత్రాలయం: నీ కొడుకు ఒకరికి డబ్బు ఎగగొట్టాడు.. ఇప్పుడే నీ కొడుకును అరెస్టు చేసి స్టేషన్‌కు తెచ్చాం.. వెంటనే డబ్బు పంపిస్తే నీ కొడుకు వదిలేస్తాం..అని డీఎస్పీ డీపీతో మంత్రాలయానికి చెందిన లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని ఎ.కోటేశ్వరరావుకు ఫోన్ కాల్ వచ్చింది. అందుకు అవాక్కైన తండ్రి ఇప్పుడే నా కొడుకు మా ఇంటికి బయలుదేరాడు. ఏం జరిగింది సార్ అంటూ ఆందోళనతో ప్రశ్నించగా.. నీ కొడుకు డబ్బు ఇవ్వకుండా ఓ బాధితుడిని వేధిస్తున్నాడంటూ చెప్పుకొచ్చాడు. ఎ.కోటేశ్వరరావుకు ఉదయం 9.30 గంటల ప్రాంతంలో డీఎస్పీ డీపీతో ఉన్న 92 34004 37457 నంబర్‌తో ఫోన్ కాల్ వచ్చింది. డీఎస్పీ డీపీతో రావడంతో కోటేశ్వరరావు కాల్‌ను లిఫ్ట్ చేశాడు. అందులో వ్యక్తిపై లాఠీచార్జీ చేస్తున్నట్లు అరుపులు కూడా వినిపిస్తున్నాయి. ఏమైంది సార్ అని కోటేశ్వరావు అడగగానే నీ కొడుకు ఇతరులతో డబ్బు తీసుకుని ఎగ్గొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నీ కొడుకును అరెస్టు చేశామంటూ నమ్మబలికాడు. హిందీలో మాట్లాడటంతో అర్థంకాని కోటేశ్వరరావు పక్కనే ఉన్న వ్యక్తితో మాట్లాడించాడు. ఆయన కొడుకును అరెస్టు చేశాం. వెంటనే రూ.30 వేలు పంపమను అంటూ కాల్ చేసిన వ్యక్తి హుకుం జారీ చేశాడు. ఇప్పుడే తన కొడుకు షాపు నుంచి ఇంటికి బయలు దేరాడు. దారి మధ్యలో ఏమైన జరిగిందేమో అని కోటేశ్వరరావు భయపడుతూ కొడుకుకు ఫోన్ చేసి అడుగగా.. నేను దారిలో ఇంటికి వెళ్తున్నా ఎవరూ అరెస్టు చేయలేదని చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నాడు. దీంతో ఇదో ఫేక్ కాల్ అని నిర్ధారణకు వచ్చిన కోటేశ్వరరావు మీకు పైసా ఇవ్వను.. అరెస్టు కాదుకదా.. జైలుకు పంపించుకోండి అంటూ గట్టిగా సమాధానం ఇచ్చాడు. దీంతో ఆ మోసకారి ఫోన్ కాల్ కట్ చేశాడు.

వీధులన్నీ మురుగుమయం



పూలచింతలో చర్చి వద్ద డ్రైనేజీ దుస్థితి



ఎస్సీ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

నందవరం : మండల పరిధిలోని పూలచింత గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు మురుగుతో కొట్టుమిట్టాడుతోంది. అపరిశుభ్రతతో గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. గ్రామంలో ఎటుచూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. గ్రామ ప్రధాన వీధి మొదలు శివారు కాలనీల్లోనూ మురుగు తాండవిస్తోంది. రాత్రి పూట దారుల్లో నడవాలంటే నరకం చూడాల్సిందే. ముఖ్యంగా ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. వృద్ధులు దారుల్లో నడవాలంటే ఒకింత జాగ్రత్త తప్పదు. మురుగు కాలువలు నిండి వీధుల్లో పారుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. స్వచ్ఛత పేరుతో రూ.లక్షలు కరిగిపోతున్నాయి. వీధులు మాత్రం బాగుపడని దుస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించాలని ఎస్సీ కాలనీ వాసులు వేడుతున్నారు.

అన్నదాన సేవకు రూ.2 లక్షలు విరాళం

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ఓ భక్తుడు రూ.2 లక్షలు విరాళంగా అందజేసినట్లు మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం బెంగళూరుకు చెందిన రవి రంగ అనే భక్తుడు నిత్య అన్నదాన సేవ కోసం రూ.2 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు మేనేజర్ చేతుల మీదుగా శేషవస్త్రం, మంత్రాక్షింతలు సమర్పించారు.

కలుగోట్లలో వృద్ధుడికి కోవిడ్ పాజిటివ్

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదు అయింది. గ్రామానికి చెందిన వృద్ధుడు జ్వరం, ఆయాసంతో సోమవారం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వైద్యం కోసం వెళ్లాడు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారించటంతో ప్రత్యేక వార్డుకు తరలించారు. మంగళవారం విషయం తెలుసుకున్న దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి రోగి ఇంటి వద్ద వివరాలు సేకరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో త్వరలో క్యాంప్ ఏర్పాటు చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందించండి

నందవరం : ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 ఏళ్లు పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ఇప్పటి వరకు మండలంలో రేషన్ పంపిణీ 55 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన వారికి కూడా రేషన్ సరకులు పంపిణీ కొనసాగుతోందని వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ మహేష్, డీటీ శశిశేఖర్ పాల్గొన్నారు.

యువకుడి మృతి

ఆదోని అర్బన్: పట్టణంలోని శివశంకర్‌నగర్‌కు చెందిన నాగరాజు కుమారుడు బోయ హరి(24) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని టూటౌన్ పోలీసులు తెలిపారు. గత నెల 31వ తేదీన పెళ్లి కాలేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న హరిని వెంటనే బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామానికి చెందిన లుతయ్య, కోసిగి గ్రామానికి చెందిన పులి ఏసురాజులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కోసిగి గ్రామ శివారుల్లోని జంపాపురం రోడ్డులో కర్ణాటక మద్యం తరలిస్తుండగా వారి వద్ద నుంచి 216 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే వారి వద్ద మట్కా చీటీలు, రూ.2,750ల నగదు కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని రిమాండుకు తరలించినట్లు వెల్లడించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్థానిక ఇంజినీరింగ్ విభాగం వర్కర్స్ యూనియన్ నాయకుడు బి.రాజేంద్ర డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. తమ సమస్యలపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చర్చలు జరిపినా ఎలాంటి న్యాయం చేయలేదన్నారు. దీంతో పూర్తి స్థాయిలో విధులకు గైర్హాజరవుతూ సమ్మెలో వెళ్లనున్నట్లు తెలిపారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి



బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా ఉదయం పార్టీ కార్యాలయం వద్దకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు రావాలన్నారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. అందువలన పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తునా తరలి వచ్చి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిన మోసాన్ని ఎండగట్టాలని కోరారు.



ఎస్.గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: అమలుకు నోచుకోని హామీలను ఎన్నికల సమయంలో ప్రజలకు ఎందుకిచ్చావు చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.గోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయం వద విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది కాలంలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన వాగ్దానాలు ఒకటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. అందువల్ల కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలకు నిరసనగా ఈనెల 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలో చేపట్టే నిరసన ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భారీగా తరలిరండి



ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు దేవా, నాయకులు

ఆదోని టౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు దేవా, కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, ఆదోని నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వెన్నుపోటు దిన పోస్టర్లు, ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వెన్నుపోటు దినంతో ప్రభుత్వానికి కళ్లు తెరిపిద్దామన్నారు. ఏడాదికాలంగా ఒక్క హామీ కూడా నెరవేర్చలేని చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్ సందీప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, ఆదోని నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినానికి తరలిరండి

కౌతాళం: కూటమి ప్రభుత్వ పాలనకు నిరసనగా బుధవారం నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండలంలోని కార్యకర్తలు తరలిరావాలని మండల కన్వీనర్ ప్రహ్లాదచారి పిలుపునిచ్చారు. ఉదయం 9గంటలకంతా మంత్రాలయం ముఖాద్వారం అభయ ఆంజినేయస్వామి దేవాలయం వద్దకు రావాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమయ్యిందని దానికి నిరసన వెన్నుపోటు దినంగా జరుకుంటున్నామని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, కోఆప్షన్ మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడులు

ఆలూరు: ఏటా ఒకే రకం పంట వేయకుండా మార్పిడి చేస్తే రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్తలు డాక్టర్ సుధాకర్, ఆదినారాయణ సూచించారు. మంగళవారం స్థానిక సీఎల్ఆర్సీ కార్యాలయంలో డీకేపీ ఆస్ట్రియా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, విత్తు ఎంపిక , పంటల మార్పిడి, దిగుబడి, నవధాన్యాల సాగు పద్ధతులు, వాటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ హరీష్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోటేకల్ గ్రామంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి గళ్ల పరీక్షలు చేయించుకొని, వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నివారించవచ్చును. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ మల్లికార్జున, నాయకులు జాలవాడి లక్ష్మన్న, హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, సీహెచ్‌ఓ దేవకృప తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: క్షయవ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు మనోజ్‌కుమార్, అభిరూప్ అన్నారు. మంగళవారం కోసిగి సచివాలయం -1 కార్యాలయంలో క్షయవ్యాధిపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దగ్గు, జ్వరం, జలుబు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేయించుకుని వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, విస్తరణ అధికారులు ఎల్లప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్

కౌతాళం: మండల వ్యాప్తంగా టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వైద్యధికారిణి పావని మంగళవారం తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారు షుగర్, బీపీ పేషెంట్లు, పొగతాగు వారు ఆల్కహాలు తాగేవారు, బరువు తక్కువగా ఉన్నవారు, టీబీ మందులు వాడుతున్న వారు తప్పకుండా టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ మందులు వాడే వారు వారి కుటుంబ సభ్యులకు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, వీరందరూ గళ్ల పరీక్ష చేయించుకోవాలని అలాగే ఎక్స్‌రే తీయించుకోవాలని సూచించారు. వీటిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చేస్తారని చెప్పారు.